# పెళ్లికూతురు

## ౧

"ఎంతదారుణం! ఇంతకూ, పాపం, మూడోపెళ్లి గీతకూడా ఉంది కామట్లు," అన్నాడు రాఘవయ్య దీనంగా.

వెంకటేశ్వర్లుగారు చిరునవ్వాపుకుని దీపంకొద్దిగా పెద్దదిచేసి బాల్యస్నేహితుడివంక చూస్తూ ఊరుకున్నాడు.

రాఘవయ్య సూటిగా వెంకటేశ్వర్లుగారిమొహంవంక చూసి పదేళ్ళయింది. అంతక్రితం రాఘవయ్య, వెంకటేశ్వర్లుగారుకూడా కొంచెం అటూఇటూగా తన హోదాకు సమానమైన హోదాగలవాడేనన్నట్లు నటించాడు. కాని పదేళ్లకిందట రాఘవయ్య కొన్నిపరిస్థితుల వల్ల దివాలాఎత్తటం, వెంకటేశ్వర్లుగారొక్కపట్టున మరోఇరవై ఎకరాలు సుక్షేత్రమైన మాగాణీభూములు కొనటం జరిగింది. భగవంతు డింతపక్షపాతంతో ప్రవర్తించటం రాఘవయ్యకు చాలాఆగ్రహకారణమైంది. కాని వెంకటేశ్వర్లు తనబాల్యస్నేహితుడని నలుగురి చెవులావేస్తూండటం చాలాఅవసరమనీ, తనికమీద ఆయనవంక తేరిమాడలేకపోవటంవల్ల తనకు కలిగే హాని ఏమీలేదనీ తీర్మానించుకున్నాడు రాఘవయ్య. ఆ పెద్దమనిషి ఇప్పు డాప్రకారంగానే వెంకటేశ్వర్లుగారి దృష్టితప్పించి ఇల్లంతా కలయచూసి, "ఎట్లాగైనా ఇంటికిసంబంధించినజ్యోతి లేకపోయినతరవాత ఇల్లు కళావిహీనంగా ఉండటంలో ఆశ్చర్యం ఏమిటి? మళ్ళీ కొంతకాలం ఇట్లా—"

"తరవాత?" అన్నాడు వెంకటేశ్వర్లుగారు.

తనధోరణిలో తను అనదలుచుకున్న ముక్క వెంకటేశ్వర్లుగారి ప్రశ్నకు సమాధానంగా అనాలంటే రాఘవయ్యకు ఒక్కక్షణం నోరుపట్టేసింది—పాడబోతున్నవాణ్ణి పాడమన్నట్లు; కాని చాలాఢక్కాముక్కలు తిని చేవదేలినఘటం కాబట్టి తట్టుకున్నాడు.

"తరవాత ఏముంది? కళ్యాణం! ఆగుతుందా ఏమిటి?"

"నాకింకా ఆమాట తట్టలేదుసుమా!" అన్నాడు వెంకటేశ్వర్లుగారు.

ఆయనమాటలో ఎక్కిరింపు రాఘవయ్య గమనించలేదు.

"తట్టలేదూ! ఇంకా నీదగ్గిరికి ఎవరూ రాలేదేమిటి? నాతో నీవిషయం నలుగురైదుగురు ప్రస్తావించారు. చిన్నవాడు, జమీందారు, బుద్ధిమంతుడు, మంచి పదవిలో ఉన్నవాడని శిఫార్సుచేశాను."

"ఎవరు చిన్నవాడు?"

"నువ్వే, ముప్ఫైఅయిదేళ్లవాడు ముసలివాడా ఏమిటి?"

"మనిద్దరికీ ఒక్కసారే అక్షరాభ్యాసమయింది. తెలుసునా? నీవయస్సెంత?"

రాఘవయ్య ఆశ్చర్యం నటించాడు. ఆయన వయస్సు నలభైఅయిదు కేమాత్రమో ఎక్కువేకాని తక్కువకాదు.

"అయితేమాత్రం! డెభ్భైఏళ్లకు పునర్వివాహం చేసుకున్నవాళ్లున్నారు"

"ఇచ్చేవాళ్లుంటే"

"నీ కిచ్చేవాళ్ళే లేరా! ఎనభైమంది పిల్లలు దొరుకుతారు. అపూచీనాది. కాని అన్నివిధాలా అనువైనపిల్ల నేను మాసినంతట్లో—"

"ఇచ్చేవాళ్లు నన్ను చూస్తారా? నా ఆస్తి చూస్తారా?"

"అది చాలా కష్టమైనప్రశ్న. కాని నిన్నుమాసి ఇచ్చేవాళ్లు లేకపోలేదు."

"ఒక్కర్ని చెప్పు."

"నేను." రాఘవయ్య చిరునవ్వునవ్వాడు.

వెంకటేశ్వర్లుగారు భావరహితమైన మొహంతో రాఘవయ్యవంక నిదానించి చూశాడు. రాఘవయ్య నైచ్యాన్నిగురించి ఆయన కేవిధమైన అనుమానం ఎన్నడూ లేదు.

“నేనూ మా శారదాంపు ఎక్కడ తగినసంబంధం దొరుకుతుందాఅని చూస్తున్నాను, వెంకటేశ్వర్లూ! ఇదే ఇంకోళ్ళయితే తొందరపడి పెళ్ళిచేసుకోనున్ను. కాని నాదగ్గిర నీకు అనుమానం ఎందుకు? చిన్నప్పటి నించీ పిల్లదాన్ని ఎరుగుదువుకదా! దాని అంద చందా లెరుగుదువుకదా! దాన్నింకొకరి కివ్వటానికూడా నాకిష్టం గాలేదు.”

వెంకటేశ్వర్లుగారు మాట్లాడలేదు. రాఘవయ్యకు కొద్దినిరుత్సాహం కలిగినా వెనక్కుతియ్యలేదు, ఆ వేడిమాదనే మరికొంచం దెబ్బలు కొట్టిచూద్దామను కున్నాడు.

“నీ కొట్లాగో పెళ్లి కావలసిఉంది. నాపిల్లకూ వివాహం కావాలి. నీతో సంబంధమంటే నా కెంతఉత్సాహంగా ఉందో నీకూ అంతఉత్సాహంగానే ఉందని అనుకుంటున్నాను. ఆలోచించుకో కొత్తవాళ్ళతో సంబంధం చేసుకొని పెళ్ళయిన మర్నాటినించీ కలహమైన సంసారం కంటె స్నేహితంలో దాంపత్యం —”

వెంకటేశ్వర్లుగారు ఏసమాధానం చెప్పకుండా సరిగా అయిదునిమిషాలు కూర్చున్నాడాలోచిస్తూ.

“ఒక్కసారి మీపిల్లతో నేను మాట్లాడాలి!”

“అంతకన్నానా? ఇప్పుడే మాయింటికి పోదాం పద!”

రాఘవయ్య ఉత్సాహం చెప్పటానికి వీల్లేదు.

“రేపుదయం ఎనిమిదింటికి వస్తాను సరిగా.”

రాఘవయ్య తనకుమార్తెవివాహం అయిపోయినట్టే భావించుకొన్నాడు. ఇక తనకు డబ్బుకొరతలేదు. ఎస్టేటుకంతా తనే మేనేజరు. ఇంతఆస్తీ తనకూతురి సంతానానికే వస్తుంది. వెంకటేశ్వర్లుగారికి ప్రథమ కళత్రంవల్లకలిగిన కుమారుడు లక్ష్మీకాంతం ఉన్నాడు. మొదటినించీ శారదకు, ఆపిల్లవాడికీ స్నేహం. రాఘవయ్యదృష్టి చాలాకాలం లక్ష్మీకాంతంమీద ఉంటూ వచ్చింది. తనకుమార్తె ఇంకా పసిపిల్లగా ఉన్న రోజుల్లోనే “అదుగోనే బావ, బావను పెళ్లిచేసుకుంటావమ్మా?” అంటుండేవాడు రాఘవయ్య. కాని ఇప్పుడదంతాపోయింది. మూడేళ్ళకింద వెంకటేశ్వర్లుగారు కొడుకును ఇంట్లోనించి వెళ్లగొట్టాడు. మళ్లీ తండ్రీ కొడుకులు ఒకరిమొహం ఒకరు చూచుకోలేదు. ఈ వైరానికి-లక్ష్మీకాంతానికీ, సవతితల్లికీ ఏదో సంబంధం ఉన్నదని తప్ప మిగిలిన విశేషాలెవ్వరికీ తెలీలేదు. తండ్రి కొడుకు లిద్దరూ ఆవిషయం ఎవరితోనూ ఎత్తలేదు. లక్ష్మీకాంతం నిర్దోషి అనుకోటానికైనా ఈమూడేళ్లనించీ అతన్నిగురించి చాలా చెడ్డకబుర్లు వినపడుతూ వచ్చినై.

వెంకటేశ్వర్లుగారి రెండోభార్యాపోయినతరవాత కూడా తండ్రి కొడుకులు కలవకపోవటం చూసి శారదకు యోగ్యుడు తప్పడనుకున్నాడు రాఘవయ్య. ఇక లక్ష్మీకాంతం పిత్రార్జితానికి బాధ్యుడే. పాపం రాఘవయ్య ప్రయత్నానికన్నీ అడ్డాలేఅయినై. చివరకు వెంకటేశ్వర్లును చూడబొయ్యేటప్పుడుకూడా ఇంతా చేస్తే వెంకటేశ్వర్లు మళ్లీ పెళ్లిచేసుకుంటాడంటాడో లేదో నని అనుమానమే. ఇంతకు భగవంతుడు తనయందుండబట్టే —

తనస్నేహితుణ్ణి వసారాగదిలో కూర్చోబెట్టి రాఘవయ్య అదివరకే పూర్తిగా అలంకరించి ఉన్న శారదను తెచ్చాడు.

“మేమిద్దరం కాస్సేపు రహస్యంగా మాటలాడుకోవాలి. నువ్వేదైనా పనిఉంటే చూసుకో,” అన్నాడు వెంకటేశ్వర్లుగారు.

రాఘవయ్య మనస్సులోనే “అంతకంటేనా?” అనుకుని బయటికి నిష్క్రమించాడు.

“ఫరవాలేదు, తలుపుతెరిచేఉండనీ,” అన్నాడు వెంకటేశ్వర్లు. రాఘవయ్య తలుపవతలనించి సంభాషణ వినటానికవకాశంలేనందువల్ల హతాశుడై తలుపుతెరిచి వెళ్లిపోయినాడు.

వెంకటేశ్వర్లు శారదనుచూసి “మాలక్ష్మీ బతికుంటే ఈనాటికీపిల్లవయస్సుది. ఇంతబాగుండేదేమోకూడా,” అనుకున్నాడు. శారదేమంత్రం ఆయన్ను లక్ష్యం చెయ్యకుండా కొంచెంసేపు అటూఇటూ పచారుచేసి చివరకు అలమారుదగ్గిరకిపోయి తన ఒంటినిఉన్న

రెండుమూడునగలూ తీసేసి, అలమారులో పెట్టి తీరిగ్గా జడవిప్పుకోటం మొదలుపెట్టింది.

"అమ్మాయి నీకెన్నేళ్లు ?" అన్నాడు వెంకటేశ్వర్లు గారు.

శారద కనుబొమలుముడేసి "మీకన్న నలభైఏళ్లు తక్కువ" అన్నది.

వెంకటేశ్వర్లుగారు నవ్వేడు. "ఆఁ! అంత అన్యాయంగా ఉండదు. పదేళ్ళయినా లేవా నీకు ?"

"ఇంకా రెండేళ్లెక్కువే."

"జుట్టు విరబోసుకున్నా అందంగానే ఉన్నావు. పెళ్ళికూతుర్నిచేస్తే ఇంకా బాగుంటావు... నేను వచ్చిన పని తెలుసునా ?"

"ఆ! నాగొంతుకొయ్యటానికి. నాగొంతంత సులభంగా తెగదు."

"ఏమంతమాటన్నావు? నీకు కళ్యాణం అయేయేర్పాటు చేద్దామనుకుంటున్నానే"

శారద ధైర్యంగా వెంకటేశ్వర్లుగారిని సమీపించి ఆయనవంకే చూస్తూ నిలబడ్డది. నడుముకు చేతులుపెట్టుకోటం ఒక్కటే తక్కువనుకున్నాడు వెంకటేశ్వర్లుగారు. ఆయన కప్పుడే ఆపిల్లనుచూస్తే భయంకూడా ప్రారంభమయింది.

"నన్ను మానాన్న మీకిచ్చిచేస్తే నూతిలోపడతాను. జ్ఞాపకంఉంచుకోండి. నే నాడపిల్లలందరిలాంటి దాన్ని కాదు. మా అమ్మ నన్నెప్పుడు, శక్తి, అని పిలుస్తుంది." కిటికీలోనించి గాలివచ్చి ఆపిల్లజుట్టు అటూఇటూ కొట్టేస్తున్నది.

"దాదాపు అట్లాగేఉన్నావు. అయితే నన్నుచూస్తే నీ కంతమంచిఅభిప్రాయం కలగటానికి కారణం ?"

"మీరు మనిషి కాదు. అయితే కాంతాన్ని పెళ్ళాం మాటలువిమ్మి ఇంట్లోనించి వెళ్ళగొడతారా ?"

వెంకటేశ్వర్లుగారు కొంచెంసేపు జవాబుచెప్పలేదు.

"నువ్వెందరితో ఇట్లాగే మాటలాడుతావా ?"

"మాటలాడను."

"నాతో నేనా ?"

"ఆ,"

కొంచెంసేపిద్దరూ మౌనంగా ఊరుకున్నారు.

"కాంతంవల్ల తప్పులేదని నీకేంనమ్మకం?"

"నాకు తెలుసు, నేను కాంతాన్ని ఇంతదాన్నప్పటీనించీ ఎరుగుదును."

"నే నెరగనా ?"

"ఎరగరు..."

"ఇప్పుడు కాంతం ఎవరితో తిరుగుతున్నాడు తెలుసునా ?"

"ఆ,"

"రౌడీలు, భోగంవాళ్లు."

"మీకన్నా, మీపెళ్లాంకన్నా మంచివాళ్ళే."

వెంకటేశ్వర్లుగారు దీనంగా నవ్వాడు.

"నీకెల్లా తెలుసు ?"

"లేకపోతే కాంతంవాళ్ళతో ఇన్నాళ్ళు కలిసి ఉండడు."

"కాంతం ఉన్నచోట చెడుండదా?"

"ఉండదు."

"నీ కింతధైర్యంగా మాట్లాడటం ఎవరు నేర్పారు?"

"మీఅబ్బాయి."

శారదకు కాంతంస్నేహితంకాక శిష్యత్వంకూడా ఉందన్నమాట !

"కాంతం ప్రతిరోజూ ఇక్కడికి వస్తుంటాడా?"

"ఆ."

"నావిషయం ఏమన్నా అంటాడా ?"

"అనడు. తననోటివెంట మీవిషయం ఎప్పుడన్నా మాట తూలిస్తే ఆరోజునించీ తనతో నన్ను మాటలాడవద్దన్నాడు."

వెంకటేశ్వర్లుగారు ఆశ్చర్యపడి "ఎందుకు ?" అన్నాడు.

"తెలివిగలవాడు కనక."

"అయితే అటువంటి దేదైనాజరిగితే వాడితో మాటలాడటం మానేస్తావా ?"

"మానను."

"ఏం ?"

"మిమ్మల్ని తిట్టటానికి నాకేమీ అభ్యంతరం లేదు...."

"అంపరాడవాళ్లూ ఇట్లామాట్లాడటంనీకిష్టమేనా?"

"అందరికోడుకులూ కాంతం స్థితికి రావటం మీ కిష్టమా?"

"లేదు"

"నాకూ లేదు."

"అది కాంతం తప్పేమో."

"కాదు. అయితే ఇదీ నాతప్పే."

"అయితే వాడికోసం నువ్విట్లు మారిపోయినావా?"

"ఆ"

వెంకటేశ్వర్లునవ్వుకుంటూ "నిన్నింకా ఎంతసేపు పరీక్షచెయ్యను," అనుకున్నాడు బిగ్గిరిగానే.

"ఇంతసేపు నన్ను పరీక్షచెయ్యండి అని మిమ్మల్ని బొట్టు కాటికపెట్టి నేను పిలవలేదు. బహుశా మానాన్న నడిగితే తెలుస్తుంది—ఇంకా ఎంతసేపు పరీక్షచెయ్యాలో."...

"మా కాంతంవల్ల తప్పులేదని చాలా కాలంకిందటనే కని పెట్టాను.

"మీ కామాట అనటానికి నామోక్షీలేదా? నిజం తెలిసినతక్షణం వెళ్ళి మీ అబ్బాయికాళ్లెందుకు పట్టుకోలేదు?"

"నాచేతకాలేదు. తగినసమయంకోసం ఎదురుచూస్తున్నాను."

"మీ అబ్బాయే పొరపాటుపడితే తెలిసినవెంటనే పోయి కాళ్ళుపట్టుకుంటాడు."

"అవును వాడికి తల్లిమంచిగుణాలన్నీ వచ్చినై."

"అటువంటి భార్యపోతే పసువైతే తప్ప మరి పెళ్ళిచేసుకోడు."

"నీయిష్టంవచ్చినట్టను. నేను మొండెత్తువేశాను. చాలాకాలంకిందనే నాగుండె రాయయిపోయింది. ఇక అరిగిపోవలసిందేకాని కరగదు."

ఈమాట కేవలం నిజంకాదు. ఆమాట అంటుండగానే ఆయనకళ్ళు చెమ్మగిల్లినై.

శారద తనకు పాజయం ప్రాగం మైందని కనుక్కుంది.

"ఇట్లారా అమ్మా!" అన్నాడు వెంకటేశ్వర్లుగారు. శారద మారుచెప్పకుండా మెల్లిగావచ్చి ఆయన పక్కనే నిలుచుంది.

"జడవేసుకోమ్మా నిన్ను మాకాంతం కిచ్చి చేస్తాను. ఒకఆడది మమ్మల్నిద్దర్నీ వేరుచేసింది. మళ్ళీమమ్మల్నిద్దర్నీ కలపటం నీవంతు. శారద తలవంచుకుంది. ఆపిల్లకళ్ళనించి రొండుబొట్లు రాలటం వెంకటేశ్వర్లెరగడు. కాని ఆయనకళ్ళనించీ కారినబిందువులు తనతలమీదపడటం శారదగమనించి అవే అక్షింతలకింద గ్రహించింది.

కొడవటిగంటి కుటుంబరావు.

# ఉగాదినాడు

ఈ మహాజ్వాల లెందాకమండనీ
 ఎన్ని లోకాలైన కాలనీ
ఈ యసంతాంభోధి భంగాలుపొంగనీ
 ఎన్ని భవనాలైన కుంగనీ
ఈ జంఝానిలప్రవీచు లిందెల్ల వీవనీ
 ఉర్వీతలంబెల్ల నుత్పాతలూపనీ
ఈ వుగాది నవయుగాది
ఈ మహోదయ వేళ
శిథిలభారత వీణ జీవతంత్రులుగూర్చి
సర్వభాతృత్వ సద్భావగీతి నేను
భారత జాతీయ ధర్మసౌధము నుండి
 వాసంత పికమునై
 మిన్నందు ఖగమునై
పైకెగిరి, పైకెగిరి, పాడకలను
ఆనందమయముగా నాడకలను.

పెమ్మరాజు రామగోపాలము